# అభివృద్ధి అన్‌స్టాపబుల్



సామాన్యుడికి ఇబ్బంది లేకుండా మౌలిక వసతుల కల్పన... నిరుపేదలు ఆత్మగౌరవంగా బతికేలా డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ... నగరవాసి ఆయుష్షు పెంచే ఆహ్లాదకరమైన పార్కులు... సర్కారు దవాఖానల్లోనే పేదవారికి ఉచితంగా ఖరీదైన కార్పొరేట్ వైద్యం... ఎన్నో ఆశలతో చదువు పూర్తి చేసుకున్న యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు... హైదరాబాద్‌ను విశ్వ నగరంగా తీర్చిదిద్దే అంతర్జాతీయ ప్రాజెక్టులు... ఇలా ఒకటేమిటి! అన్ని రంగాల్లో తొమ్మిదిన్నర సంవత్సరాలుగా హైదరాబాద్ మహా నగరంలో అభివృద్ధి జాతర కొనసాగుతున్నది. ఇందులో భాగంగా గత నెల రోజుల్లోనే వేలాది కోట్ల అభివృద్ధి పనులు అందుబాటులోకి రాగా... భవిష్యత్ కోసం మరిన్ని వేల కోట్ల అభివృద్ధి పనులకు పునాది రాయి పడింది. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సహా గ్రేటర్ మంత్రులు విరామం లేకుండా చేస్తున్న ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఉత్సవ వాతావరణం నెలకొన్నది. అనతి కాలంలోనే కండ్ల ముందు నగర రూపు రేఖలు ఊహించని రీతిలో మారుతుండటంతో నగరంలో ఏ మూలకు వెళ్లినా ప్రజల్లో అభివృద్ధిపైనే విస్తృతంగా చర్చ జరుగుతున్నది.

- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ)

## నెల రోజుల్లోనే వేలాది కోట్ల పనులు

- డబుల్ బెడ్రూంతో నిరుపేదలకు సాకారమవుతున్న సొంతింటి కల
- భారీ ఎత్తున అందుబాటులోకి మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులు
- పాత నగరంలోనూ ఐటీ వెలుగులు... పర్యావరణహితంగా నగరం అడుగులు
- అంతర్జాతీయ పెట్టుబడులతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు



ఉప్పల్‌భగాయత్ వద్ద మూసీపై నిర్మించే ఐదు వంతెనల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కేటీఆర్, చిత్రంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు(ఫైల్)

## మూసీ.. మురిసేలా..

ఇప్పుడు అనేక సినిమాలు మొదలు నగరంలో రూపుదిద్దుకునే ప్రతి వెబ్ సిరీస్‌లోనూ కనిపించే దృశ్యం... దుర్గం చెరువు తీగల వంతెన. మరి ఒక్క వంతెనతోనే అటు పర్యాటకం, ఇటు సౌకర్యం ఈ స్థాయిలో ఉంది. త్వరలోనే తలదన్నే రీతిలో మూసీపై ఏకంగా పద్నాలుగు వంతెనలు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఆ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అద్భుతమైన డిజైన్లతో మూసీ, ఈసీలపై 14 వంతెనల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా... ఇందులో ఏడు వంతెనల నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.545 కోట్లతో మంచిరేవుల, బుద్వేల్ ఐటీ పార్కు వద్ద రెండు, ఉప్పల్ భగాయత్, ప్రతాప సింగారం, మూసారాంబాగ్, ఫతుల్లాగూడ... ఇలా ఏడు చోట్ల వంతెనల నిర్మాణానికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నది.

## కలలోనూ ఊహించని ఐటీ అడుగులు..

దేశంలో ఐటీ అంటేనే బెంగళూరు నగరం. కానీ ఈ తొమ్మిదిన్నరేండ్లలో ఆ నగరాన్ని వెనక్కి నెట్టి ఐటీలో మేటిగా నిలిచింది హైదరాబాద్. అదేవిధంగా హైదరాబాద్‌లో ఐటీ అంటే వెస్ట్ సిటీ. తెలంగాణ సర్కారు ఆ గమనాన్నీ మార్చి... ఐటీ వెలుగులు నలుదిశలా వ్యాపించేలా చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా తూర్పు నగరంలోనూ ఐటీ టవర్లు వస్తున్నాయి. అయితే పాత నగరంలో ఐటీ పార్కు అనేది ఎవరూ కలలో కూడా ఊహించలేదు. ఏకంగా రూ.700 కోట్లతో 21 అంతస్తుల ఐటీ టవర్ నిర్మాణానికి మలక్‌పేటలో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయడమనేది హైదరాబాద్ చరిత్రలోనే ఓ కీలక పరిణామం. రానున్న రోజుల్లో పాత నగరంలోనూ టెకీల సందడి కనిపించనున్నది. అంతేకాదు... హైటెక్ సిటీలో మాదిరిగా మెట్రో స్టేషన్ నుంచి ఈ ఐటీ టవర్‌కు స్కైవాక్ కూడా నిర్మాణం కానున్నది.



మలక్‌పేట్‌లో నిర్మించనున్న ఐటీ టవర్ నమూనాను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ(ఫైల్)

## దేశంలోనే తొలిసారిగా సైకిల్ ట్రాక్..



ప్రపంచంలో రెండోదిగా... దేశంలోనే తొలిసారిగా ఓఆర్ఆర్ సోలార్ రూఫ్‌టాప్ సైకిల్ ట్రాక్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. నానక్‌రాంగూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు, నార్సింగ్-కొల్లూరు వరకు సుమారు రూ.120 కోట్ల అంచనా వ్యయంతో 23 కిలోమీటర్ల ట్రాక్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ ట్రాక్ సైకిలిస్టులకు గొప్పవరంగా మారింది. ముఖ్యంగా ట్రాక్ అందుబాటులోకి వచ్చిన రెండు, మూడు రోజుల్లోనే ఏకంగా పది వేల మంది సైకిలిస్టులు ట్రాక్‌ను వినియోగించడం విశేషం.

సోలార్ రూఫ్‌టాప్ సైకిల్ ట్రాక్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు (ఫైల్)

## క్యాన్సర్ చికిత్సలో రోబోటిక్ సేవలు..

తెలంగాణ వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు రాగా.. ఇందులో భాగంగా క్యాన్సర్ చికిత్సలో రోబోటివ్ సేవలు వచ్చాయి. ఇప్పటికే నిమ్స్‌లో రూ.32 కోట్లతో రోబోటివ్ సేవలు కొనసాగుతుండగా... ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలోనూ రూ.32 కోట్లతో రోబోటిక్ సేవల్ని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఆదివారం సంతాన సాఫల్య కేంద్రం గాంధీ ఆస్పత్రిలో అందుబాటులోకి రానున్నది. ఈ కేంద్రాన్ని మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారు.



ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో రోబోటిక్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ(ఫైల్)

## పేదోళ్ల ప్యాలెస్‌లు..



బేగంపేట్ పాటిగడ్డలో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ (ఫైల్)

నగరంలో చిన్నపాటి పుట్టిన రోజు వేడుకలు చేయాలన్నా ఇంట్లో చేయడం సాధ్యం కాదు. చిన్నపాటి ఫంక్షన్ హాల్‌కు వెళ్లినా వేలాది రూపాయల అద్దె. ఇలాంటి తరుణంలో నిరుపేద సైతం శుభకార్యాలను జరుపుకొనేందుకు తెలంగాణ ప్రభుత్వం మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా గత నెల రోజుల వ్యవధిలోనే పలు చోట్ల ఇవి అందుబాటులోకి వచ్చాయి. బేగంపేటలో రూ.7 కోట్లతో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, వెంగళరావునగర్‌లో రూ.2.60 కోట్లతో నిర్మించిన ఫంక్షన్ హాల్ పేదలకు అందుబాటులోకి వచ్చాయి.

## అంతర్జాతీయ పెట్టుబడులకు స్వర్గధామం..

నగర శివారు అంతర్జాతీయ పెట్టుబడులకు స్వర్గధామంగా మారింది. గత నెల రోజుల్లోనే వేలాది కోట్ల పెట్టుబడులు రావడం విశేషం. చందనవెల్లిలో సింటెక్స్ రూ.350 కోట్లు, కిటెక్స్ రూ.1200 కోట్ల పెట్టుబడులతో ముందుకు రాగా... మంత్రి కేటీఆర్ ఆ కంపెనీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా జీనోమ్ వ్యాలీలో రూ.200 కోట్ల బీఎస్ఈ, రూ.వెయ్యి కోట్లతో యూరోఫైన్స్ ముందుకు రాగా... వాటికి కూడా మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.



చందనవెల్లిలో సింటెక్స్ కంపెనీ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య(ఫైల్)

## రికార్డు స్థాయిలో డబుల్ బెడ్రూం ఇండ్లు..



మురహరిపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం గృహ సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు(ఫైల్)

తెలంగాణ ప్రభుత్వం కేవలం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏకంగా లక్ష ఇండ్ల పంపిణీకి నడుం బిగించడమనేది దేశ చరిత్రలో రికార్డు. దేశంలోని ఏ రాష్ట్రంలో చూసినా కేంద్ర సహకారంతో అక్కడ నిర్మించే ఆ ఇంటి విలువ రూ.2-3 లక్షలకు మించదు. కానీ హైదరాబాద్ పరిధిలో నిరుపేదలకు పంపిణీ చేస్తున్న డబుల్ బెడ్రూం ఇంటి నిర్మాణ వ్యయం సుమారు రూ.9 లక్షలైతే.. బహిరంగ మార్కెట్లో దాని విలువ దాదాపు రూ. 50 లక్షలు. ఇంత ఖరీదైన ఇండ్ల పంపిణీకి శ్రీకారం చుట్టిన తెలంగాణ ప్రభుత్వం.. కేవలం నాలుగు విడతల్లోనే ఏకంగా 61,596 మంది నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడం విశేషం. మున్ముందు మరిన్ని విడతల్లో లక్ష ఇండ్ల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది.



లేక్‌ఫ్రంట్ పార్క్ ఛాయచిత్రాలను పరిశీలిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్(ఫైల్)

## చెరువుల చెంత ఆహ్లాదం..

హుస్సేన్‌సాగర్ తీరంలో రూ.26.65 కోట్లతో నిర్మించిన లేక్ ఫ్రంట్ పార్క్ అందుబాటులోకి రాగా... కూకట్‌పల్లి నియోజకవర్గంలోనూ రూ.19.30 కోట్లతో రంగదాముని చెరువు సుందరీకరణను పూర్తి చేసుకుంది. అదేవిధంగా దుర్గం చెరువు వద్ద రూ.9 కోట్లతో మ్యూజికల్ ఫ్లోటింగ్ ఫౌంటెయిన్ కూడా ఇటీవలే అందుబాటులోకి వచ్చింది.

## వంద శాతం మురుగు శుద్ధి దిశగా..

నగరంలో రోజుకు 1950 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తి అవుతుండగా... ప్రస్తుతం 40 శాతం శుద్ధి సామర్థ్యం ఉంది. ఈ నేపథ్యంలో వంద శాతం మురుగు శుద్ధి చేసేందుకు రూ. 3,866.41 కోట్ల అంచనా వ్యయంతో 31 ఎస్టీపీలను నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కోకాపేట, దుర్గం చెరువు ఎస్టీపీలు అందుబాటులోకి వచ్చాయి.



దుర్గం చెరువు ఎస్టీపీ ప్రారంభోత్సవంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే గాంధీ(ఫైల్)



మురుగు వ్యర్థాల రవాణా వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

## దళిత కుటుంబాల్లో వెలుగులు..

రూ.16.20 కోట్ల వ్యయంతో ఇటీవలే 162 కుటుంబాలకు దళిత బంధు ద్వారా మురుగు వ్యర్థాల తరలింపు వాహనాల పంపిణీ పూర్తయింది. మురుగు వ్యర్థాల తరలింపు వాహనంతో ఒక్కో కుటుంబం నెలకు రూ.1.20 లక్షలు సంపాదించడంతో సహా 486 మందికి ఉపాధి లభిస్తుండటం విశేషం.

## పర్యావరణహితంగా..

హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణాను పర్యావరణహితంగా మార్చేందుకు అడుగులు మొదలయ్యాయి. ఏకంగా వెయ్యి గ్రీన్ బస్సుల లక్ష్యంగా తొలి విడతగా 25 బస్సులు అందుబాటులోకి వచ్చాయి. జీరో పొల్యూషన్ ప్రాతిపదికన ఈ బస్సులు సేవలు అందించనున్నాయి.






అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

## సనత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్: ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం ఎంతో కృషి చేస్తున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శనివారం మోండామార్కెట్, బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, బేగంపేట్ డివిజన్‌ల్లో పర్యటించి రూ. 1.32 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా బన్సీలాల్‌పేట్‌లోని సీ క్లాస్, సీసీ నగర్, రామస్వామి కాంపౌండ్, రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని అవులమంద, మోండా మార్కెట్ బండిమ్మెట్, బేగంపేట్‌లోని పాటిగడ్డ, భగవంతాపూర్, ఓల్డ్ కస్టమ్స్ బస్తీలలో సివరేజ్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ..నూతనంగా చేపట్టిన సివరేజీ వాటర్ లైన్ పనులు పూర్తయిన వెంటనే రహదారుల నిర్మాణం చేపడుతామన్నారు. కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

## అడగకుండానే అనేక సంక్షేమ పథకాలు

- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట: కోట్ల రూపాయల నిధులతో మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ల రూపు రేఖలను మారుస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేటలో శనివారం రూ.75 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.9.2 కోట్లతో నిర్మాణం చేసిన బడంగ్‌పేట నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవనం, రూ.4.25 కోట్లతో ప్రజా భవనం, రూ.2.40 కోట్లతో కుర్మల్‌గూడలో 24 కుల సంఘాల భవనాలకు, రూ.4.72 కోట్లతో కుర్మల్‌గూడలో డీఆర్సీసీ సెంటర్‌ను నాదర్‌గుల్‌లో ధోబీఘాట్ పనులకు తదితర అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అడగ కుండానే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాత నర్సింహరెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మియాపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

## మళ్లీ గెలుస్తా.. మరింత అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్/ కొండాపూర్ : ప్రజల ఆశీర్వాదంతో హ్యాట్రిక్ విజయం సాధించి.. మరిన్ని నిధులు సమీకరించి.. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శనివారం మియాపూర్ డివిజన్ పరిధిలో రూ.7.47 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. చందానగర్‌లో రూ. 3.06 కోట్లతో పలు కాలనీల్లో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.